"అయితే రావన్నమాట."

అతని గొంతు కఠినంగా మారిపోయింది.

"కన్య వుందిగా తీసుకువెళ్ళండి... మీ సరదాలకి, సినిమాలకీ ఆవిడ కావాలి. ఎవరికో సంబంధించిన యిలాంటి వ్యవహారాలకి నేను కావాలి.... వెరీగుడ్... చాలా బాగుంది."

"కన్య నా భార్య కాదు."

"ఓహో, భార్యకంటే ఎక్కు వైన ఉంపుడు గత్తేమో."

"శిల్పా..." ఆవేశంగా పైకి లేచిన చేతిని ఎవరో పట్టుకోవటంతో ప్రక్కకు చూశాడు.

కన్య...

ఉద్రేకాన్ని అదుపులోకి తెచ్చుకుని చరాచరా బయటకు నడిచాడు.

స్థాణువులా నిలబడ్డ శిల్ప చేతిని ఆప్యాయంగా అందుకుని ఆమెను గదిలోకి నడిపించింది కన్య.

శిల్ప ఇంకా క్రోధంతో కంపించిపోతూనే వుంది.

ఆమె నేత్రాలు రోషాగ్నుల్ని చిమ్ముతూనే వున్నాయి.

"శిల్పా.... నువ్వనుకున్నట్టు నేను నీ శత్రువును కానమ్మా .... అర్థాంతరంగా జీవితంలో అన్ని పోగొట్టుకున్న అభాగ్యురాలిని..."

"గెటవుట్ .... ఎవరూ నన్ను ఓదార్చనక్ఖర్లేదు...."గట్టిగా అరిచింది శిల్ప.

ఉబికి వస్తున్న ద:ఖాన్ని అదుపు చేసుకునే శక్తి లేక తన గదిలోకి వెళ్ళి పసిపిల్లలా ఏడ్చేసింది.

నిశ్చింతగా నిద్రపోతున్న నానీని చూస్తుంటే ఆమెకు మరింత ద:ఖం ముంచుకొచ్చింది.

అయినా తమాయించుకుంది.

చాలాసేపు ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చింది.

కాలనీ సైట్‌కి వెళ్లిన కిరీటి ఆఫీసుకి వెళ్ళకుండా తిన్నగా బంగళాకి వచ్చేశాడు.

మనసంతా అదోలా వుంది.

సోఫాలో కొంత సేపు కూర్చుని న్యూస్ పేపరు తిరగేశాడు.

కన్యకు తన దాంపత్య జీవితం గురించి పూర్తిగా తెలిసిపోయినందుకు అతనికి సిగ్గుగా వుంది.

తను వెళ్ళాక ఏమైనా రాద్ధాంతం అయ్యుంటుందన్న అనుమానంతో తిన్నగా కన్య గదిలోకి వెళ్ళాడు.

కన్య ఎంతగా ప్రయత్నించినా ఆమె ముఖంపై అలుముకున్న విషాద రేఖల్ని కప్పిపుచ్చుకోలేక పోయింది.

"నువ్వింత అనుచితంగా ప్రవర్తిస్తావని నేనెప్పుడూ అనుకోలేదు." కన్య మాటలకు అతడి తల వాలిపోయింది.

“కిరీటీ... శిల్ప ఇంకా చిన్నపిల్ల... ఆవేశంలో అమాయకంగా ఒక మాటందనుకో.... నీ తెలివేమైంది ?”

ఏమని బదులు చెప్పగలడు....

శిల్పకు అహంకారం తప్ప ఆలోచించే శక్తిలేదని మొత్తమంతా ఎకరువపెట్టాలా.... ఏరికోరి పెళ్ళి చేసుకున్నందుకు భర్తగా తనకు అణు మాత్రం సుఖం లభించలేదని బాధను వెళ్ళగక్కుకోవాలా....

“శిల్ప మాత్రమే కాదు కిరీటి! నిజం తెలియనపుడు శిల్ప స్థానంలో వున్న ఏ ఆడ పిల్లయినా అలాగే ప్రవర్తిస్తుంది. నేనెవరన్నదీ ముందే శిల్పకి తెలిస్తే, కనీసం నువ్వు తెలియ పరిచి వుంటే ఇంత రాద్ధాంతం జరిగి ఉండేది కాదుగా” నచ్చచెబుతున్నట్టుగా అంది.

కిరీటి మౌనం ఆమెను మరింతగా బాధపెట్టింది.

చెప్పాలని వున్నా చెప్పుకోలేని అశక్తతతో అతడెంత నలిగిపోతున్నదీ అర్థం చేసుకుంది.

“వద్దు కిరీటి --- నా మూలంగా మీ మధ్య స్పర్థలు రావటం నేను భరించలేను.” తల వంచుకుని నెమ్మదిగా అంది.

“లేదు కన్యా మా మధ్య కలతలకు కారణం నువ్వు కాదు..... ఇట్సాల్ మై ఫేట్.....”

జీవితంలో అన్నీ కోల్పోయిన కన్య బాధపడటం అతడు సహించలేడు.

“కిరీటి! నానీ కూడా శిల్పకు బాగా చేరికయ్యాడు. నేను లేకపోయినా నానీ సుఖంగా బ్రతకగలడన్న నమ్మకం నాకేర్పడింది.”

“కన్యా....”అతడి గొంతు వణికింది.

“నాకూ మనశ్శాంతి కావాలి.” ఆమె కంఠం రుద్ధమైంది.

“అందుకుని ....”

“ఎన్నాళ్ళుగానో అనుకుంటున్నాను... అరవిందాశ్రమానికి వెళ్ళిపోవాలని...”

“కన్యా ... యీ ఆస్థికంతటికీ అధికారిణివి నువ్వు. దీనిపై నీకు లేని మక్కువ నాకు మాత్రం దేనికి?” నిర్వేదంగా ఆమెవైపు చూశాడు.

“అవును కన్యా! అంతటిని పరత్యజించి నువ్వు ఆశ్రమాల వెంట బ్రతుకుతుంటే నీకు చెందాల్సిన హక్కుల్ని నేనిక్కడ అనుభవిస్తూ హాయిగా వుండలేను...”

“అందుకని .... ”

“ఈ రోజే నా సర్వాధికారాల్ని వదులుకుంటున్నాను... ప్రాపర్టీని నీ పేరు మీదకి ట్రాన్స్‌ఫర్ చేసి నేనూ దూరంగా వెళ్ళిపోతాను” నిశ్చలంగా అన్నాడు.

కన్య కొన్ని క్షణాలపాటు మాట్లాడలేక పోయింది.

“వద్దు కిరీటి! అలా జరిగిననాడు నాన్నగారి ఆత్మకు శాంతి వుండదు .”

“నువ్విలా విరాగిణిలా బ్రతకాలనుకుంటే మాత్రం వారి ఆత్మకు శాంతి ఉంటుందనుకున్నావా కన్యా!”

కర్తవ్యంతోచనట్టుగా  ఆమెతల వంచుకుంది.

"కన్యా! అనాధగా  మిగిలిపోవాల్సిన నన్ను ఇంతటి వాడ్ని  చేసి ఇన్ని అర్హతలు కల్పించారు మీ నాన్నగారు... ఆయన ఆస్థికి మత్రమేకాక నీక్కూడా ఆసరాగా నిలబడే అదృష్టాన్ని కలిగించు...."

కన్య మౌనంగా ఉండిపోయింది.

0 0 0 0 0 0 0 0 0 0 0 0

అ రోజే ఆమెను అఫీషియల్ కాలనీలోని బంగళాకి తీసుకెళ్ళాడు.

ఇకనుండి ఆమె ఉండాల్సింది అక్కడే అన్నపుడు ఆమె ఆశ్చర్యపోయింది.

కన్య శిల్పకు దూరంగా మరో ఇంట ఉండాలన్నది అతని అభిమతం ఆవిధంగా తన సమస్యకు పరిష్కారం లభిస్తుందని మాత్రం కాదు.... శిల్ప కన్యతో సమస్యగా మారకుండా ఉంటుందని.

కన్య మనసులో కూడా నిజానికి మరో చోట ఉండాలన్న తలంపు కొన్ని రోజుల క్రిందటే కలిగింది. కాని నోరు తెరచి కిరీటిని అడగలేకపోయింది. కారణం శిల్ప అనాధరణ మూలంగా తను వెళ్ళిపోవాలనుకుంటుందన్న ఆలోచన కిరీటి మనసులో కలుగుతుందేమోనన్న భయం....

మరుసటి రోజే నానీతో సహా కన్య ఆ బంగళాకి మారిపోయింది.

కిరీటి దగ్గరుండి కావలసిన ఫర్నీచరు, వంటసామాగ్రి ఏర్పాటు చేశాడు.

ఆమెను బలవంతంగా షాపింగ్‌కి తీసుకెళ్ళి నానీకి కావలసిన బట్టలు, ఆమెకు కావలసిన చీరలు ఖరీదు చేశాడు.

ఆమెకు ఒంటరితనం తప్పించాలన్న ఉద్ధేశ్యంతో  తరచుగా ఆమెతో కలిసి మాట్లాడటం అలవాటు చేసుకున్నాడు.

అతని హృదయాంతరాళ్ళలో ఒకటే ఆలోచన.....

మోడువారిన కన్య జీవితం మళ్ళీ చిగురించాలి.

17

స్టేట్స్ నుండి శలవుపై స్వదేశానికి తిరిగివచ్చిన యోగేంద్ర రాకతో శిల్పలో కాస్త చైతన్యం వచ్చింది.

యోగేంద్ర శిల్ప మేనమామ కొడుకు. తల్లిదండ్రులు లేని యోగేంద్ర సివిల్ ఇంజనీరింగ్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషను పూర్తిచేసి స్టేట్స్‌లోని ఓ కన్‌స్ట్రక్షను కంపెనీలో జాబ్ చేస్తున్నాడు.

చిన్నప్పటి నుండి కలిసిమెలసి పెరగటంతో యోగేంద్ర దగ్గర శిల్పకు చనువెక్కువ.

పైగా యోగేంద్ర స్వతహాగా మాటకారి కావటంతో ఎటువంటి వారినైనా ఇట్టే ఆకట్టుకుంటాడు.

అందుకే యొగేంద్ర ఓ మూడు నెలల పాటు ఇండియాలోనే వుంటాడనే సరికి ఆమెకు ప్రాణం లేచివచ్చి నట్టయింది.

మూడేళ్ళ క్రిందట తన వివాహానికి ఇండియా వచ్చినపుడు తప్ప ఈ మధ్య కాలంలో శిల్పను కలియలేదతను.

పెళ్ళయిన ఏడాదికే ఓ ప్రమాదంలో భార్య మరణించటంతో మనఃస్థిమితంలేక శిల్ప వివాహానికి రాలేకపోయాడు.

అందుకే స్వదేశానికి తిరిగి రాగానే ముందుగా తుంపాల వెళ్ళి రంగనాధంగారి ద్వారా శిల్ప వివరాలు కనుక్కుని వైజాగ్ వచ్చాడు.

అతి విచిత్రంగా జరిగిన తన వివాహం గురించి శిల్ప చెబుతుంటే అంతా విన్న యోగేంద్ర ఆమె వైవాహిక జీవితం సంతృప్తికరంగా లేదన్న విషయాన్ని అతి సునాయాసంగా గ్రహించగలిగాడు.

సాయంకాలం ఆఫీసునుండి వచ్చిన కిరీటికి యోగేంద్రను ఎలా పరిచయం చేయటమా అని శిల్ప సంశయిస్తూంటే ఆమెకు ఆ ఇబ్బంది లేకుండా తనకు తానే పరిచయం చేసుకున్నాడు యోగేంద్ర.

కరచాలనం చేసుకుంటూ పరస్పరం కొన్ని క్షణాలపాటు నిశితంగా చూసుకుంటూ నిలబడి పోయారిద్దరూ .

కిరీటి చనువుగా మాట్లాడుతున్నా ఏకాగ్రత చూపించలేక పోతున్నాడు యోగేంద్ర.

మనసు అట్టడుగు పొరల్లో అస్పష్టంగా కదులుతున్న ఓ జారిపోయిన స్మృతిని గుర్తు చేసుకుంటున్నట్టుగా అలసటతో వాలిపోతున్నాయి అతని చూపులు.

కంప్యూటర్ని మించిన అతని మేధాశక్తికి అదో పరీక్ష.

అయినా ఓడిపోయాడు.

మనసుకు అద్దం పడుతున్న నిర్మలమైన అతని లావణ్యాన్ని చూస్తుంటే శిల్ప చాలా అదృష్టవంతురాలు అనిపించింది. కానీ శిల్ప ఆటల్లోని గూఢంగా దాగిన నైరాశ్యానికి కారణమేమిటో అతనికి బోధపడలేదు.

కిరీటి బలవంతంపై డిన్నర్ అక్కడే పూర్తి చేశాడు.

చాలాసేపటి వరకూ కూర్చున్న యోగేంద్ర ఆ రాత్రికి అక్కడే విశ్రమించమని కిరీటి కోరినా మళ్ళీ తర్వాత కలుస్తానని చెప్పి డాబా గార్డెన్స్లో వున్న అతని ఇంటికి వెళ్ళిపోయాడు.

యోగేంద్ర కిరీటితో అంత చనువుగా మెలగటం శిల్పకు నచ్చలేదు.

తనకు కాస్త కాలక్షేపంగా వుంటాడనుకుంటే తనను కాదని శత్రు పక్షంలో చేరిపోయినట్టనిపించింది.

మనసులో అసూయ దాచుకోలేని శిల్ప “మనుషుల్ని ఆకట్టుకోవటం మీకు వెన్నతో పెట్టిన విద్యనుకుంటాను.” అంది అక్కసుగా .

“అంత శక్తే ఉంటే నిన్ను దూరంగా పడుకోనిచ్చే వాడ్నా?” ఉడికిస్తున్నట్టుగా అన్నాడు.

“నేను అందరిలాంటి దాన్ని కాదు..... రాజానరేంద్రదేవ్ మనవరాల్ని.....”

“ఏం ఆయనగారు భర్తతో కాపురం చేయవద్దనేమన్నా ప్రభోధించారా ?”

“ఇలా మాట్లాడితేనే నాకు మాహా తిక్క...”

“అదికూడా మీ తాతగారి నుండే సంక్రమించిన అలవాటనుకుంటాను.”

ఆమె విసురుగా తన గదిలోకి వెళ్ళిపోయింది.

మరుసటి రోజు ఫ్యాక్టరీలోని తన చాంబర్‌కి వచ్చిన యోగేంద్రను సాదరంగా ఆహ్వానించాడు కిరీటి.

దగ్గరుండి ఫాక్టరీ అంతా చూపించాడు.

యంత్రాల నమూనాలను చెక్కతో చేసే పేటర్న్ షాప్ మొదలుకుని ఫౌండ్రీ, మార్కింగ్, ఫేబ్రికేషన్, మెషిన్‌షాప్, ఎసెంబ్లీ సెక్షన్లన్నిటినీ ఎంతో ఆసక్తిగా పరిశీలించిన యోగేంద్ర ఉత్పత్తిని పెంచాలని నిర్విరామంగా కృషిచేస్తున్న- కార్మికుల్ని వారి క్రమశిక్షణని చూసి విస్తుపోయాడు.

అతి చిన్నవయసులోనే ఇంతటి భారీ పరిశ్రమను చాకచక్యంతో నిర్వహిస్తున్న కిరీటిని మనసులోనే అభినందించాడు.

క్వాలిటీ విషయంలో కిరీటి తీసుకుంటున్న శ్రద్ధాశక్తులే మార్కెట్టును సైతం ఆకర్షించడానికి కారణాలు అన్న నిర్ధారణకు వచ్చాడు.

డిజైన్స్ డిపార్ట్‌మెంటు నుండి బయటకు వస్తుండగా యోగేంద్ర అడిగాడు “లేబర్ ప్రాబ్లమ్ ఎలా వుందని?”

వీలైనంత వరకూ కార్మికుల పరంగా సమస్యలు తలెత్తకుండా వాటిని ముందే ప్రెడిక్ట్ చేయటం నాకు అలవాటు. ఆఫ్టరాల్ మనదేశంలో కార్మికులు ఎదుర్కొనేది ఆర్థికమైన దుస్థితి. సాంకేతికంగా మనమెంత పురోభివృద్ధిని సాధించినా పారిశ్రామికమైన ప్రశాంతత లేకపోవటంతో అడుగడుగునా సమ్మెలు, లాకౌట్స్ అధికమై ఎన్నో “మేన్ అవర్స్”ను నష్టపోతూ తద్వారా ఉత్పత్తి కూడా కుంటుబడే పరిస్థితికి కూడా దిగజారి పోతున్నాం. దానితో ఎకనామికల్ కండిషన్స్ పడిపోవటం, ధరల్ని అదుపు చేయలేకపోవటం వంటి కృత్రిమమైన పరిస్థితుల్ని మనమే కొనితెచ్చుకుంటున్నాం.... సో.... నాకు కావలిసినంత మేరకు వాళ్ళచేత పని చేయించుకోవటం, వాళ్ళకు కావలసిన వనరుల్ని నేను సమకూర్చటం అన్న సూత్రంతో ఇంతవరకు సవ్యంగానే కర్మాగారాన్ని నడిపిస్తున్నాను. అలా అని ప్రతి “ఎంప్లాయిర్” ఇలా ఎందుకు ఆలోచించటం లేదు అని మీరు అడిగితే నా దగ్గర జవాబులేదు....”

ఇండస్ట్రియల్ సైకాలజీ గురించి అతిచక్కగా విశ్లేషించిన కిరీటి మేధాశక్తికి ఆశ్చర్యపోయాడు యోగేంద్ర.